# హార్ట్‌ఫుల్‌నెస్ ఉద్యమము

## కమలేష్ పటేల్

7 జులై 2019, కాన్హా శాంతి వనము, హైద్రాబాదు

అందరికీ నమస్కారాలు

ఇక్కడ చాలా మంది, దాదాపు ఆరు వందల నుండి ఏడు వందల దాకా ఉన్న యువతీ యువకులను చూస్తున్నందుకు నాకు చాలా ఆనందంగా ఉన్నది. అదిసరే, విశ్వమంతటా ప్రసారము అవుతున్న దీని ఉద్దేశ్యము ఏమిటి? నిజానికి కారణాలు ఎన్నో ఉన్నాయి. శ్రీ రామచంద్ర మిషన్ యొక్క 75వ వార్షికోత్సవానికి మీలో ప్రతి ఒక్కరినీ ఆహ్వానించడము అన్నది ఒక ఉద్దేశ్యము. దీని దృష్ట్యా ఇందులో పాల్గొనే అభ్యాసీలను రెండు బ్యాచ్ లుగా విభజించాము. మొదటిది జనవరి నెల 28, 29 మరియు 30 వ తేదీలలోనూ, రెండవది, ఫిబ్రవరి నెల 1 న మొదలై 3వ తేదీ వరకు ఉంటుంది. సూర్య మానము ప్రకారము ఫిబ్రవరి 2వ తేదీ బసంత్ రోజు లాలాజీ జన్మదినము. ఇంకా చాంద్ర మానము ప్రకారము జనవరి 29న లాలాజీ జన్మదినము. బాబూజీ మహారాజ్ దీనిని బసంత పంచమి అనేవారు. అందుకని చాలా మంది అభ్యాసులు ఉత్సాహంగా పాల్గొనాలని నేను కోరుతున్నాను. ముఖ్యంగా ఈ ఉత్సవము కోసమై మేము జులై 24 మరియు సెప్టెంబరు 28 ఉత్సవాలను రద్దు చేసాము. ఈ విధంగా వాటి కోసము డబ్బు ఖర్చు పెట్టలేని వారు కనీసము బసంత పంచమి లేక ఫిబ్రవరి 2 న జరిగే ఉత్సవంలో పాల్గొనగలరని ఆశిస్తున్నాను.

ఈ ఉత్సవం మనము సామాన్య అభ్యాసులకు మాత్రమే పరిమితము చేయకూడదని నా అభిమతం. మనము యూ-కనెక్ట్, సి-కనెక్ట్ ఇంకా ఇతర కనెక్టుల ద్వారా సహజ మార్గమునకు పరిచయము చేసిన క్రొత్త వారందరికీ ఈ సందేశాన్ని అందించి వారందరూ భండారా వాతావరణాన్ని అనుభూతి చెందాలని కోరదాము. వారు ప్రాణాహుతి అనుభూతి

చెందారు; కానీ భండారా సమయాల్లో ఉండే కృప యొక్క పరిచయము వారికి ఉండదు. ఈ ఉత్సవము మన ప్రతి ఒక్కరి జీవితములో ఒక గొప్ప అనుభూతి. 1999లో కొందరు 4 బ్యాచులలోనూ పాల్గొన్నారు. అలాగే ఈ 2020 లో కూడా పాల్గొందాము.

నేనిప్పుడు మీకు కొన్ని గణాంకాలు చెప్పాలనుకొంటున్నాను. మనకిప్పుడు ప్రపంచవ్యాప్తంగా కొన్ని లక్షల మంది అభ్యాసీలు ఉన్నారు. వీరందరూ హృదయము ద్వారా ధ్యానము చేయడాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకొన్నారు. మరియు గత 5, 6 సంవత్సరాలలో మన ప్రిసెప్టార్ లు మూడింతలు అయ్యారు. ఇంకా వేలాది మంది కార్యకర్తలు (వాలంటీర్స్) మన ఈ ఉద్యమాన్ని ఫలవంతము చేయాలని అహర్నిశలూ శ్రమిస్తున్నారు. ఈ మధ్య దేశవ్యాప్తంగా ధ్యానోత్సవాలు మొదలయ్యాయి. 25 కంటే ఎక్కువ ధ్యానోత్సవాలు ఇప్పటికే సంపన్నమయ్యాయి. ఇంకా ఎన్నో అవబోతున్నాయి. 2020 బసంత్ ఉత్సవాల వరకు మనము 100 కు పైగా ధ్యానోత్సవాలు నిర్వహించాలని నేను కోరుతున్నాను. ఈ ధ్యానోత్సవాలు నగరాలలో మరీ పెద్దపెద్ద ఉత్సవాలు కానక్కర లేదు.

దేశం మొత్తంలో ఇప్పటివరకూ నిర్వహించిన ధ్యానోత్సవాల ద్వారా మనం తెలుసుకున్న విషయాలు ఇవి: మీకు X అనే చోట ఒక వేదిక ఉన్నదనుకుందాం; దాని నుండి 2 కిలోమీటర్ల దూరం వరకు మీకు అధిక సంఖ్యలో పాల్గొంటారు. ఈ 2 - 3 కిలోమీటర్ల దూరం దాటినప్పటినుంచీ పాల్గొనేవారి సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంది. అందువల్ల, ఉత్తమమైన విషయమేమంటే మనం ఆ 2 -3 కిలోమీటర్లమీదే దృష్టి ఉంచి, అక్కడివారినే ఆకర్షించాలి. మొత్తం నగరమంతా పని చేయనక్కర్లేదు. వేదిక చుట్టూ 2-3 కిలోమీటర్ల మీద కేంద్రీకరించండి. దీనివలన చాలా లాభాలున్నాయి: పాల్గొనేవారి సంఖ్య చిన్నదిగా ఉంటుంది; అంటే హాలు పెద్దది అవనవసరం లేదు. అదేమీ స్టేడియం కానవసరం లేదు; అది ఒక హాలులోనే కాబట్టి వర్షాకాలంలో కూడా మనం నిర్వహించుకోవచ్చు. ఖర్చు కూడా తగ్గుతుంది, నిర్వహణ తేలిక అవుతుంది. అదే మీరు 5000, 10000 ప్రేక్షకులంటే కొద్దిమంది వాలంటీర్లతో ఉన్న సెంటర్లకు చాలా కష్టమవుతుంది.

ముందు ముందు, మనకు ఇంకా చాలా కార్యక్రమాలు ఉన్నాయి; వాటిలో ప్రభుత్వం ప్రోత్సాహించేవి కూడా ఉన్నాయి. ఉదాహరణకు, గుజరాత్, తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్, మాహారాష్ట్ర లలో చాలా విద్యాసంస్థలు, ప్రభుత్వ శాఖలు దీనికి మొగ్గు చూపుతున్నాయి. ఈ మధ్యనే ముంబై మునిసిపల్ కార్పొరేషన్ వారు 1,00,000 మంది ఉద్యోగులకు శిక్షణ ఇవ్వవలసిందిగా అభ్యర్థించారు. దీనినంతటినీ మనమెలాగ నిభాయించుకోవాలి? అక్కడ మనకు 500 మంది మాత్రమే  నిత్యం అభ్యాసం చేసే వారున్నారు. అది చాలా కష్టంతో కూడుకున్న పని. మహబూబునగర్ జిల్లాలోనే ఒక్కచోటే 720 మంది గ్రామ సర్పంచులకు అంటే 720 గ్రామాలలో  శిక్షణనివ్వ వలసి వచ్చింది. మనకు కేవలం 50 నుండి వందమంది  ప్రిసెప్టర్లు మాత్రమే అందుబాటులో ఉన్నారు. మనం మూడు రోజులపాటు వరుసగా గ్రామాలకు వెళ్ళడానికి 700 మంది ప్రిసెప్టర్లను వినియోగించినా కూడా, వారితో పాటుగా  కొత్తగా చేరిన 100 మందిని, వారిని చూసుకోవటానికి మనలో చాలామందికి చాలా కష్టతరం అవుతుంది.

అందుచేత కనెక్ట్ ప్రోగ్రాములకు సంబంధించి ఒక ఏర్పాటు ఆలోచించాను. వీటికీ, ప్రభుత్వ కార్యక్రమాలకీ, అదే సమయంలో స్కూళ్ళ ప్రోగ్రాములకీ, యు-కనెక్ట్ ప్రోగ్రాములకీ ప్రచారంచేసే అభ్యాసీ వాలంటీర్లకు ఇది సాధ్యమయ్యేలా చేద్దామనుకుంటున్నాను. నేను ఇప్పుడు మాట్లాడేది వాలంటీరు కార్యక్రమం కాదు; నేను వారికి ఈ స్థానాలు ఉద్యోగంలా ఇద్దామనుకుంటున్నాను. ఈ ఉద్యోగ విస్తారం గురించి ఆలోచించండి. మనకు భారత దేశం మొత్తంలో 700 పైగా జిల్లాలున్నాయి. రాబోయే రెండు సంవత్సరాలలో మనం కేవలం 300 మీదే దృష్టి పెట్టినా, దాని అర్థం ఒక సంవత్సరంలో 150 జిల్లాలలో పనిచేయాలి; మరి ప్రతి జిల్లాలోనూ సుమారుగా 10 మండలాలుంటాయి. అంటే, 150 X 10 - 1500 మండలాలు; మనకుగనక ప్రతి మండలంలోనూ ఇద్దరు ఉద్యోగస్తులు ఉంటే, హార్ట్‌ఫుల్‌నెస్ ఉద్యమం గురించి మనం మాట్లాడుతున్నది సుమారు 3000 మంది ఉద్యోగస్తులు అన్నమాట.

ఇప్పుడు, నెలకు సుమారు 20 నుండి 25 వేల జీతంతో - ఇంకా ప్రయాణాలవంటి ఖర్చులతో కలిపి 30 వేలు - ఇది మొత్తం ఒక సంవత్సరానికి 60 నుండి 70 కోట్ల బ్రహ్మాండమైన మొత్తం అవుతుంది. మన ప్రస్తుత ఖజానా ఎంతవరకు నిలబడగలదు? ఎక్కువకాలం కాదు. వ్యాపార కంపెనీలను ప్రభావితం చేసేవిధమైన పలుకుబడి మనకు లేదు; అందుకని మనవద్ద ఉన్న పరిమితమైన వనరులమీదే మనం ఆధారపడాలి.

ఎంత చిన్న మొత్తమైనప్పటికి, అది మన లక్ష్యాన్ని నెరవేర్చగలదు. మీ ఫోన్లలో ఉన్న కాలిక్యులేటర్లు ఉపయోగించి మీరే లెక్క వేసి చూడండి. కేవలం రోజుకు 50 రూపాయల పొదుపు 50,000 మంది అభ్యాసులు 365 దినాలు చేస్తే, అది 91,25,00,000 అవుతుంది. రోజుకు 50 రూపాయల ఖర్చు వలన మీకేమైనా నష్టం అనిపిస్తుందా? మనలో చాలామంది అది భరించగలం. మనలో కొందరు అభ్యాసులు నెలకు ఐదు కోట్లు ఖర్చు పెట్టినా వారికి ఏమీ కాదు, మరోవైపు రోజుకు కనీసం పది రూపాయల విరాళం అయినా బరువయ్యే అభ్యాసులు కూడా ఉన్నారు. అందుచేత, మొత్తం మీద ఈ రోజుకు 50 రూపాయల లెక్కలలో మనలో కొందరు కలిసి, నిభాయించవచ్చు; తద్వారా మనం 3,000 మందిని నియోగించి దేశం మొత్తం మీదా 150 జిల్లాలలో హార్ట్‌ఫుల్‌నెస్ ను విస్తరించే లక్ష్యమేగాక,  మిగిలిన నిధులను వివిధ ధ్యనోత్సవాల కోసం వినియోగించవచ్చు.

మనం చేసే ఈ ధ్యానోత్సవాలన్నీ ఉచితంగా జరగట్లేదు. కొన్ని ధ్యానోత్సవాలు ఒక్కొక్కటీ 25,00,000 రూపాయలు మనకు ఖర్చవుతాయి; కొన్ని ధ్యానోత్సవాలు 8,00,000 రూపాయలవరకూ ఖర్చవుతాయి. మనం చూసిందేమంటే, ఒక్కొక్క ధ్యానోత్సవమూ సుమారు 16 నుండి 18 లక్షలవరకు అవుతుంది; ఇంక మనం ఆవిధమైన 200 ధ్యానోత్సవాలు ప్రతి సంవత్సరమూ నిర్వహించాలంటే ఆ మొత్తం పెరుగుతూ ఉంటుంది. ఇంకా మనం భండారాలు నిర్వహించుకోవాలి, మనల్ని సందర్శించే అతిధులుంటారు. ప్రతి నెలా కొన్ని వేలమంది టీచర్లకి శిక్షణ ఇవ్వాలనుకుంటున్నాం - ఆవిధంగా మనం చెయ్యాలనుకునేవి చాలా ఉన్నాయి. అందుచేత, మనకు చాలా బాధ్యత ఉంది. చేద్దామనుకుంటున్నవారినీ, చేయగల సమర్ధత ఉన్నవారినీ, రోజుకు 50 రూపాయలు

ఆదాచేయమని నేను మనవి చేస్తున్నాను. అది చాలా సహాయపడగలదు. మీరు దీనిని నగదు రూపంగా ఇవ్వనవసరం లేదు; నిజానికి స్థానిక సెంటర్లలో నగదు రూపేణా ఇవ్వటాన్ని నేను హర్షించను. మేలైన పని ఏమంటే, ఆ మొత్తం మీవద్ద కూడబెట్టి, ప్రతి నెలా 30 X 50 = 1500 రూపాయలు మన డొనేషన్ ఖాతాకు మీరు వైర్ ట్రాన్స్ఫర్ [బదిలీ] చేయవచ్చు. అది అంత తేలిక. ఎవరైనా అంతకంటే ఎక్కువ చేయగలిగితే చాలా సంతోషం.

కొంతకాలం క్రితం అమెరికాలో మనము ఇలాంటి పథకమే ప్రవేశపెట్టాం; రోజు కేవలం ఒక డాలర్ ఆదాచెయ్యటం. కేవలం రోజుకి ఒక్క డాలర్ - మెల్లిమెల్లిగా ఈ మొత్తం వాస్తవానికి మరింతమరింతగా పెద్దదవుతుంది. మన దగ్గర 2000 మంది అభ్యాసులున్నప్పుడు రోజు ఒక డాలర్ అంటే, రోజుకు 2000 డాలర్లు. ఆవిధంగా 365 రోజులు. ప్రతి సంవత్సరమూ ఆ దేశంలో మనకు ఒక కొత్త ఆశ్రమం ఏర్పడగలదు. 50000 మంది అభ్యాసులు ప్రతివారూ రోజుకు 50 చొప్పున విరాళం ఇస్తే, మనకు ఇక్కడ కూడా అలాంటి స్థితే వస్తుంది. ఎవరికీ భారమవకుండా, మనకు తేలికగా 20 ఆశ్రమాలు భారతదేశంలోని వివిధ మూలలో ఏర్పరచుకోవచ్చు. కోట్లలో విరాళమిచ్చే ధనవంతులమీద మనం ఆధారపడితే ఏమవుతుంది? ఆ పరిస్థితిలో ఎలా ఉంటుందో ఆలోచించండి; మనం ఋణపడి ఉంటాం. ఒకే మనిషి గనక 50 కోట్లో, లేక 20 కోట్లో ఇస్తే, ఆ ఋణభారం ఇంకా ఎక్కువగా ఉంటుంది. దానికి బదులుగా మన మిషన్ లోని ప్రతిఒక్కరూ విరాళమివ్వగలిగితే, అది చాలా గొప్ప విషయం; ఐతే నేను మరోసారి చెప్తున్నాను - ఇదేమీ తప్పనిసరి కాదు. అది మీ హృదయం నుంచి గనక వస్తే, చాలా ఉన్నతమైనది. మీకేమైనా అనుమానంగానీ, సంకోచంగానీ ఉన్నా, లేక మీరు విరాళం ఇవ్వదలచకపోయినా, మీరు ఆవిషయం అసలు మాట్లాడనవసరం లేదు. మన మాస్టర్లకు దీనిని గురుప్రసాదంగా నేను సమర్పిద్దామనుకుంటున్నాను. హృదయం ఒప్పుకోకపోతే, అది పండని బత్తాయి లాగా ఉంటుంది. బత్తాయిగానీ, మామిడి గానీ, పక్వానికి రాకపోతే పుల్లగా ఉంటాయి. అయిష్టంగా ఉన్న హృదయాలు ఇందులో పాలుపంచుకోనవసరం లేదు, పాలుపంచుకోకూడదు. అలాంటివారు కనీసం మీ హృదయాన్ని తెరిచి, ఈ మిషన్ యొక్క

మంచి గురించి ప్రార్థన చేయండి; మీ ప్రార్థన ద్వారా భగవంతుని కృప వర్షించి మన హార్ట్‌ఫుల్‌నెస్ ఉద్యమం చక్కని మలుపు తిరిగేలా చూడండి.

ఈ ప్రాపంచికమైన విషయాల తర్వాత, నేను ఇప్పుడు కొన్ని ఆధ్యాత్మిక విషయాల గురించి మాట్లాడతాను. అది, మార్పు గురించి. మొదట్లో మనలో చాలామంది విపరీతమైన మార్పుకు లోనౌతారు. మొదటి వారం, రెండవ వారం, మొదటి సంవత్సరం, రెండవ సంవత్సరం, మూడవ సంవత్సరం - మనలో విప్లవాత్మకమైన పరిణామాలు మనం చూస్తాం. ఐతే, కాలంలో మనం ముందుకు సాగినకొద్దీ ఈ మార్పు, ఈ పరిణామం, ఏదోవిధంగా తగ్గిపోయి, మనం మన పాత అలవాట్లకు ఎలాగో దాసులయ్యే ఉండిపోతాం. ఇంక మార్పు లేకపోవడానికి అలవాటుపడిపోతాం. “నేను పురోగతి చెందాను” అనే అభిప్రాయానికి వచ్చేస్తాం. “నేను పురోగతి చెందాను” అనే భావనే మనకు అడ్డు అవుతుంది. 99 శాతం అభ్యాసులలో దీన్ని నేను చూసాను; అందుకే ఈ విషయం ప్రస్తావిస్తున్నాను. మీరు ఎక్కడున్నారో మీరు ఆలోచించుకోండి; మీ ఆధ్యాత్మిక పురోగతితో మీరు సంతోషంగా ఉన్నారా? ఆలోచించండి: "నేను ఎక్కడ పొరపాటు పడ్డాను? నేను ఎలా సరిదిద్దుకోగలను?" మాస్టర్లనుండి మీకు ఏవిధమైన సహాయం కావాలి? కొన్ని మౌలికమైన ప్రశ్నలకు మీరే ఆలోచించి, సమాధానాలు చెప్పుకోగలరు. మీరు నాకేమీ రాయనవసరం లేదు. మరో లక్ష మెయిల్స్ [ఉత్తరాలు] నాకు వద్దు. ఇంది మీ అంతరంగంలోని చర్చ. "మిషన్ లో ఇన్ని సంవత్సరాల తర్వాత, నా పురోగతితో నేను సంతోషంగా ఉన్నానా?" "నేను ఇంకా ప్రశ్నిస్తున్నానా?" "ఈ మిషన్ నాది ఐందా?" "అందరు సోదరీసోదరులను నావాళ్ళుగా అనుకోగలుగుతున్నానా?" "నేను వాళ్ళకు చెందుతానా? వాళ్ళు నాకు చెందుతారా? మనమందరమూ ఈ మహత్తరమైన మిషన్ కు చెందుతామా?"

సత్యోదయం వంటి చక్కని పుస్తకాలు మనం చదివినప్పుడు, మనం అందులో ఏమి కనుగొంటాం? ఐదు సంవత్సరాల క్రితం కొన్ని అధ్యాయాల అర్థం మీకు తెలిస్తే, అది ఈరోజు మళ్ళీ చదివినప్పుడు మరింత లోతైన అవగాహన మీకు కలగకపోతే - మీరు

స్తంభించిపోయినట్లుగా తెలుసుకోండి. అర్థం గనక మరింత లోతై, మీ హృదయాన్ని మరోవిధంగా తాకితే, కొన్ని సంవత్సరాల కిందటికన్నా మీరు మరింత ఎక్కువగా ఆనందించగలిగితే, మీరు అదృష్టవంతులుగా భావించుకోండి. ఐతే ఆ అంతర్గత అవగాహన మీ హృదయంలో మరింత స్ఫూర్తిని ఇస్తోందా? చాలామంది అభ్యాసులు అనంతవాణి యొక్క అర్థాన్ని తెలుసుకోలేకపోతున్నారు - లాలాజీ వారి మాటలు, 40 సంవత్సరాల సాధన తరవాత కూడా జనాలను గందరగోళపెడతాయి. ఆ పుస్తకాన్ని మీరు అర్థం చేసుకోగలిగితే, మీరు అదృష్టవంతులుగా భావించండి: "అవును, నేను అర్థం చేసుకోగలను." అర్థం చేసుకోలేకపోతే, మీ సాధనను పునఃపరిశీలన చేసుకోండి. సరే, మాటలకు వాక్యాలకూ పరిమితులుంటాయి; కానీ అవి చదివినప్పుడు అది మన అంతరంగ స్థితిని ప్రతిబింబిస్తుంది.

ఈ హార్ట్‌ఫుల్‌నెస్ ఉద్యమాన్ని మండలాలన్నింటికీ మరింతగా విస్తరించేందుకు సహాయపడే సలహాలను, అన్ని వైపుల నుండి కోరుతున్నాను. ఇది అన్ని రాష్ట్రాల నుండి, అన్ని ప్రదేశాల నుండి కూడా ఆశిస్తున్నాను. మన హార్ట్‌ఫుల్‌నెస్ ఆంధ్ర, తెలంగాణా, తమిళనాడు, కర్నాటక, మహరాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రాలన్నింటిలో చాలా బలంగా వ్యాపించి ఉన్నది. అందుచేత మనం ఈ రాష్టాలలోని ప్రతిఒక్క మండలంలో మొదలు పెడదామా లేక ఇంతవరకూ హార్ట్‌ఫుల్‌నెస్ ఉనికి లేని ప్రాంతాలకు ప్రాముఖ్యత నిద్దామా? మనం ఇప్పటికే బలంగా ఉన్నచోట, ఎక్కువ మంది ఉన్నచోట మన ప్రయత్నాలను మరింత తీవ్రతరం చేద్దామనుకుంటున్నాను. అందుచేత మనం యథాప్రకారం, ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలలో ప్రారంభిద్దాము. అక్కడ మనం చేసే ప్రతిపనికీ ఇప్పటికే ఉన్న వారి నుండి మనకు సహాయ సహకారాలు అందుతాయి.

క్లుప్తంగా చెప్పాలంటే, ఇది మీ అందరి సహాయం కోరే అభ్యర్థన. ఈ విధంగా మనం ఈ హార్ట్‌ఫుల్‌నెస్ ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్ళగలము. వేల సంఖ్యలో ఈ రాబోయే భండారాకు హాజరు కావడానికి అభ్యాసులు నమోదు చేసుకుంటారని

భావిస్తున్నాను. మన పూజ్య లాలాజీ జయంతి ఉత్సవాల సందర్భంగా జరిగే ఈ భండారా రెండు పర్యాయాలుగా [బాచీలుగా] జరుపబడుతుంది.

మీ అందరికీ ధన్యవాదాలు; అందరూ శ్రద్ధగా విన్నందుకు ధన్యవాదాలు. పెద్ద సంఖ్యలో మీ అందరినీ కలవాలని ఆశిస్తున్నాను. భండారా నిర్వాహకులను ఆశ్చర్య పరచే విధంగా, వసతి సౌకర్యాలను ఏర్పాటు చేయటానికి వారు పరుగులు పెట్టే విధంగా మీరు పెద్ద సంఖ్యలో రావాలి. ముందు ముందు మనం శాశ్వత వసతులను ఏర్పాటు చేసుకుంటున్నాము. మీరు ఇక్కడకు వచ్చే సమయానికి మనం ఒకే సమయంలో కనీసం 35,000 నుండి 40,000 మంది వరకు ఉండగలిగే విధంగా ఏర్పాట్లు చేయగలుగుతాము. మీరు వచ్చే సమయానికి మెడిటేషన్ హాలు కూడా తయారై ఉంటుంది. పూజ్య లాలాజీ మహరాజ్ జయంతిని మనం జరుపుకొనే నాటికి అన్నీ కూడా మన అంచనాల కనుగుణంగా ఉంటాయి.

ఈ ఘనమైన ఉత్సవంలో మీరందరూ పాల్గొనటానికి అధ్యాత్మికంగా తయారుగా ఉండండి. మీ సాధనను ఇంకా తీవ్రతరం చేయండి. ఇంకొద్ది రోజులలో ఈ 90 రోజుల సవాలు ముగుస్తుందనుకుంటున్నాను. చాలా మంది అభ్యాసులు ఈ సవాలులో పాల్గొన్నారు, దానికి నేను చాలా చాలా సంతోషిస్తున్నాను. వారి అధ్యాత్మిక స్థితిలో చాలా వేగవంతమైన మార్పును, ఉన్నతిని నేను అనుభూతి చెందగలుగుతున్నాను. ఇది ఇంక ముందు ముందు మరింత తీవ్రతరమౌతుంది. నిదానించ వద్దు. 90 రోజులనే దాని ఉద్దేశ్యం, దానిని ముందు మీరు ప్రయత్న పూర్వకంగా చేయడం ద్వారా అలవాటుగా మార్చుకోవటానికే; తరువాత అది మీ ప్రయత్నం లేకుండానే సాగుతుంది, ఆటోమాటిక్ అవుతుంది. మీరు ఉద్దేశ్య పూర్వకంగా చేసే ఈ పనిని మీరు మీ ప్రమేయం లేకుండానే చేయగలగాలి. అప్పుడది అలవాటుగా మారుతుంది. ఆ తరువాత మనం మరొక మంచి అలవాటును చేపడదాము. ఈ ప్రక్రియ కొనసాగుతూనే ఉండాలి. తద్వారా మనం ఇంకా ఇంకా పురోగతిని సాధిస్తాము. ధన్యవాదాలు.